# అభూత వైద్యం

ఆఫీసర్ నిరంజన్ రావంటే అల్లాటప్పా మనిషి కాదు. అలాగని ఆరున్నరడుగుల అందగాడూ కాదు, అపర ప్రవరాఖ్యుడూ కాదు.

ఎత్తు నాలుగున్నరడుగులు దాటదు. బరువు రెండు క్వింటాళ్ళకు తగ్గదు. మెడకాయ కనబడక పోతేనేం ? గుమ్మడికాయంత తలకాయుంది. కృష్ణవర్ణం, ఎత్తుపళ్ళు, చీమకళ్ళు, పొట్టికాళ్ళు, పొడగాటి జనపాలు ... మొదటిసారి చూచిన మనిషి ఆశ్చర్యంతో దవడలు నొక్కుకుంటూంటే - తన ప్రత్యేకతలను తానే తలుచుకుంటూ దర్జాగా మురిసి పోతుంటాడు.

బాల్యమిత్రులెవరన్నా సరదాగా ఏనుగు గున్నా! ఖడ్గమృగమా! అని సంబోధిస్తే కోపానికి రాడు. షేక్‌హాండిచ్చినట్టే ఇచ్చి అమాంతం మీద పడిపోతాడు. అంతే .... ఆ మిత్రరత్నము ఏనుగు కాలుకింద ఎండు అప్పడమై కుయ్యో మొర్రో అనాల్సిందే.

ఆఫీసు పనిలో అన్ని ట్రిక్కులూ తెలుసుకుని అంచెలంచెలుగా మెట్లెక్కుతూ మానేజరు దాకా ఎదిగాడంటే మాటలా, మజాకా?

అంతటి నిరంజన్‌రావు మత్తుగా కారు దిగి - పందిట్లో కెల్తున్న పెళ్ళికొడుకులా అడుగులో అడుగేస్తూ గమ్మత్తుగా లోపలికొచ్చాడు. సబార్డినేట్స్ గుడ్‌మాణింగ్‌లను గుమ్మగా స్వీకరిస్తూ అతి కష్టమ్మీద చాంబర్ చేరుకున్నాడు. బుల్లి కాళ్ళను రింగ్ చేర్‌లోకి ముడుచుక్కూచోగానే కొండంత బరువు దించుకున్నట్టైంది. ఒక్క ఫైలన్నా రెక్కలు విప్పకముందే ఆవులింత తోసుకొచ్చింది. కంటి రెప్పలు బరువై పోయినై. అలవాటు ప్రకారం శరీరం వెనక్కు జేరగిలబడింది.

నిద్రను చతుష్షష్ఠి కళల్లో చేర్చనందుకు అప్పుడప్పుడు బాధపడ్తుంటాడు. నుంచుని (బెంచీ మీద కాబోలు!) నిద్రబోవడం హైస్కూల్లో అలవాటైంది. నడుస్తూ నిద్రబోవడం కాలేజీలో ప్రాక్టీసైంది. ఆఫీసర్‌గా ప్రమోషన్ రాక ముందు ఆఫీసుకు నడిచొచ్చేవాడు. అప్పుడు రెండుమూడు రోడ్డు ప్రమాదాలైన మాట వాస్తవమే కాని అతణ్ని గుద్దుకున్న లారీలు షేపులు మారి అక్కడికక్కడే కుప్పకూలి పోయినై. అందులో ఓ లారీ యజమాని డామేజి సూటు వేసి నాలిక్కరుచుకున్నాడు. ఆ వార్త పత్రికల్లో ప్రముఖంగా చోటు చేసుకుంది. ఆ విషయాన్నెవరైనా ప్రస్తావిస్తే,

"ఆ సంగతి గిన్నిస్ బుక్కాఫ్ వరల్డ్ రికార్డ్స్ కెక్కకపోవడం నా దురదృష్ట" మంటాడు.

ఆవులిస్తే పేగులు లెక్కబెట్టే వాళ్ళుండొచ్చు గానీ హార్మోనియం సౌండ్‌లా గురకదీస్తూ పీ.టీ.వో. ల మీద సంతకాలొత్తే క్రెడిట్ మాత్రం మనవాడికే దక్కింది. పెళ్ళిలో గురకదీస్తూ - మూడుముళ్ళేసిన వైనాన్ని ఇప్పటికీ భార్య గుర్తు జేసి నవ్వేస్తూంటే - ఛప్పన్న రాజ్యాలను చిటికెలో గెలిచిన చక్రవర్తిలా ఫీలైపోతాడు.

"దయ్యం ... దద... దయ్యం సార్!" అటెండర్ ఆశయ్య గావుకేకకు నిరంజన్‌రావు గురక గుటుక్కుమంది.

వెధవది! బంగారం లాంటి నిద్ర బండల పాలైంది! కుండబొజ్జను కుదురుగ్గా నిమిరాయి చేతులు.

"దయ్యమా? నువ్వా, నేనా?" గుడ్లురిమాడు గుర్రుగా.

"మ్మీ... మీరు... మ్మీరూ...!" నాలుక తడారిపోతుంది. గుడ్లు నిలబడిపోయినై.

"నేను ... న్నేను... నేను దయ్యాన్నా ?" వళ్ళు మండింది. కళ్ళు విశాలమైనై.

"క్క... క.. కాద్సార్!" వణికిపోతున్న ఆశయ్య చూపుడువేలు ఛాంబర్ బయటకు చూపించింది. చీమకళ్ళ దృష్టి చటుక్కున మళ్ళగానే కోపం కొండెక్కి పోయింది. భయం ఆవహించింది.

నల్లని ఆకారం... మొహం, కాళ్ళూ, చేతులు... అన్నీ నల్లనే... అమ్మో! కదుల్తున్న రాక్షసి బొగ్గులా చాంబర్ వైపే వస్తుందా ఆకారం.

"నిజమే .... ద్ద...ద...దయ్యం!" ముదిరిన కోడిపుంజులా ఎగిరి గంతేసి టేబుల్‌మీది కొచ్చేశాడు. ఫైళ్ళు చిందరవందరై పోయినై.

ఆశయ్యను పక్కకు నెట్టేసి ఆకారం టేబుల్ ముందుకొచ్చింది ఠీవిగా.

"వామ్మో ....!" నిరంజన్‌రావు పొలికేకకు దిక్కులదిరిపోయినై. భారీ శరీరం కిందపడిపోయింది. గబుక్కున టేబుల్ కిందికి దూరిపోతుంటే టేబుల్ మీదున్న గాజు ఫ్లవర్ వాజు నెత్తిమీద పడి ముక్కలైపోయింది.

"బతికుంటే బేగంబజార్లో బజ్జీలమ్ముకు బతకొచ్చు" - గొణుక్కుంటూ బయటికొచ్చేశాడు ఆశయ్య.

హడలిపోయిన ఉద్యోగుల చూపులన్నీ ఆశయ్య మీద వాలినై.

"చాంబర్లో చాంతాడంత పాముజొచ్చిందా?" ఔటువార్డు గుమస్తా ఆదినారాయణ కాళ్ళు ఆసాంతం కుర్చీలోకి ముడుచుకుపోయనై ముందు జాగ్రత్త చర్యగా.

"పగటి కలలో పెళ్ళామొచ్చి పీకనులిమిందేమో!" ఇన్‌వార్డ్ గుమాస్తా ఇందిర కిసుక్కుమంది.

"పొరపాటున తన గురక తానే విన్నాడేమో!" కమల కనురెప్పలు కందిరీగ రెక్కల్లా టపటప లాడినై.

"అసలేమైందో చెప్పవయ్యా!" ఇంటి ఖర్చులు ఆఫీసు ఫైల్లో రాసి పరేశానై పోతున్న సుకుమార్ అసహనం. ఎకౌంట్స్ సెక్షన్‌లో ఆరి తేరిన వాణ్ణని తెగమురిసి పోతుంటాడు. ఈ రోజిలాగైందేమిటీ ... దయ్యమేమన్నా .... అనుమాన మొచ్చేసింది.

ఆశయ్య కాళ్ళూ చేతులు కథాకళి ఆడుతున్నై.

"ఛాంబర్లో... మ్మ... మన... మానేజర్.... " అతి కష్టమ్మీద నాలుక కదిలింది.

"ఛాంబర్లో ఏమైందీ? మన మానేజర్ ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడా?" మొదటి భార్య ఉరేసుకు చావడం ప్రత్యేకంగా చూచిన మాణిక్యరావులో గందరగోళం.

"నేనున్నా. నీకేం భయంలేదు. చెప్పురా ఆశయ్యా!" సీనియర్ అటెండర్ సీనయ్య వీపు నిమిరి ధైర్యం నూరిపోశాడు.

ఊపిరి పీల్చుకున్నాడు ఆశయ్య. వగర్చడం ఆగిపోయింది. "హమ్మయ్యా!" నిట్టూర్చాడు.

"మానేజర్ చాంబర్లకు దయ్యమొచ్చిందన్నా!"

"ఆఁ ... దయ్యమా!" కోరస్.

ఆఫీసంతా హడల్.

"శ్రీ ఆంజనేయం, ప్రసన్నాంజనేయం..." దండక మందుకున్నాడు సుధాకర్.

"ఆడ దయ్యమో, మగ దయ్యమో!" ఇందిర వెన్నుపూసలో తుఫాన్ తొంగి చూచింది.

మూడుముళ్ళేయించుకున్న మూన్నెళ్ళల్లో - ఆరళ్లతో హడలగొట్టి భర్తను టపా కట్టించేసిన సుమంగళికి చురుక్కుమంది. "మా పక్కింటాయనకూ, నాకూ సంబంధమంట గట్టిన నా భర్తే దయ్యమై వచ్చాడేమో!" గొణుక్కుని వణికిపోతుంది.

ఒకర్ని పట్టకుండా ఒకరు సీట్ల మీంచి లేచొచ్చిన ఉద్యోగులు - బెల్లం ముక్క మీద వాలిన ఈగల్లా అద్దాల చాంబర్ ముందు గుమిగూడారు.

కలుగులోంచి బయటకు చూస్తున్న ఎలుకలా టేబుల్ కింది నుండి పైకి చూస్తూ హన్మాన్ చాలీసా నెమరేస్తున్నాడు నిరంజన్‌రావు. టేబుల్ ఆనుకుని నిటారుగా నుంచుందా నల్లని ఆకారం.

"దయ్యం నల్లగుంటుందా ఆశయ్యా?" సుమంగళి కనుమానమొచ్చింది.

"ఆడదయ్యం తెల్లగుంటుంది. మగదయ్యం నల్లగుంటుంది." ఆశయ్య క్లారిఫికేషన్.

" వామ్మో ! అది నిజ్జంగా దయ్యమే!" క్షుద్ర సాహిత్యం విపరీతంగా చదివే బిల్ గుమాస్తా సర్టిఫికెట్.

"అయ్యా! దయ్యంగారూ!" మోచేతుల ఆధారంగా తలపైకి లేపిన నిరంజన్‌రావు చేతులు జోడించాడు. ఆకారం వెనక్కు జరిగి అంతా గమనిస్తూంది. "ప్లీజ్! నన్నొదిలెయ్! ఏం కావాలో చెప్పెయ్!" ప్రాధేయపడ్తున్న నిరంజన్‌రావు మోకాళ్ళకూ, మోచేతులకూ ప్లవర్‌వాజ్ ముక్కలు గుచ్చుకుంటున్నాయి.

ఆకారం కుర్చీలో కూచుంది. నిరంజన్‌రావు గుండె పిచ్చుకపిల్లలా పీచు పీచుమంటూంది. మరింత వెనక్కు జరిగి బోర్లా పడుకున్నాడు. ... ఈ దయ్యమేదో ఓ కునుకు దీశాక వస్తే బాగుండేది... అనుకున్నాడు.

"ముందు మన మానేజర్ను ఆ తర్వాత మనందర్నీ భోంచేస్తుందేమో!" ఇందిరకు కాళ్ళూ చేతులాడ్డం లేదు.

"మరెలా?" వెన్నులోంచి తన్నుకొస్తున్న వణుకు నాపుకుంటూ "సీనయ్యా! భూత వైద్యున్ని పిలుచుకు రా పో!" పురమాయించాడు మాణిక్యరావు - నుదుటి చెమటను సుదాకర్ షర్టుతో తుడుచుకుంటూ.

"రాను పోను ఆటో మాట్లాడుకుని తొందరగా తీసుకు రా పో! ఖర్చులు సమానంగా భరిద్దాం లే!" ఏడ్వబోయి నవ్వేశాడు సుధాకర్ షర్టు లాక్కుని.

"జాగ్రత్త సీనయ్యా! నీకేమన్నా అయితే నీ భార్య ఒంటరిదై పోతుంది." గుండెలు బిగపట్టుకుంది సుమంగళి.

కుబుసం విడిచిన కోడెనాగులా పరుగెత్తాడు సీనయ్య.

అందరి దృష్టి తిరిగి చాంబర్లో దూరింది. అటెండెన్స్ రిజిష్టరందుకుంటుందా ఆకారం. ఆదినారాయణ బుర్రలో మెరుపు -

"అర్రెర్రే! వారం రోజుల క్రితం చనిపోయిన మన జనరల్ మేనేజర్ దయ్యమై ఇన్స్పెక్షన్ కొచ్చాడండీ!"

"ఐతే ... ఆ దయ్యానికేదో తప్పు దొరక్కా మానదు. మనందర్నీ మసాలా వడల్లా నమిలి టిఫిన్ చెయ్యకా మానదు". కమలాకర్ కాళ్ళూ చేతులు పిసుక్కుంటున్నాడు.

"దయ్యంగారూ! నాకు నిద్దరాగడం లేదు. కాస్సేపు పర్మిషనిస్తారా!" నిరంజన్‌రావు ఆవులింత.

"మీరు నిద్ర లేచేసరికి దయ్యం కడుపులో ఉంటారు సార్!" అంటూ ముందుకెళ్ళబోయి వెనకడుగేశాడు సుధాకర్.

"రోజూ పొద్దున్నే నిద్రలేచి నా భార్యకు జడవేసి పూలుబెట్టేవాణ్ణి. ఈ రోజు ఆలస్యంగా లేచానని తిట్ల పురాణం విప్పింది. జడ కుదరలేదు. పూలు విసిరికొట్టింది. ఆ అపశకునానికి ఫలితమిదన్న మాట!" అంటూ ఇందిర వైపు చూచాడు మాణిక్యరావు.

"అన్నం మాడిపోయిందని మా ఆయన్ను అట్లకాడతో అరుసుకున్నానీ రోజు. ఆ పాపానికి ప్రాయశ్చిత్తంగా దయ్యానికి ఫలహారమై పోవాలన్నమాట!" ఇందిర ముక్కు చీది విసిరికొట్టింది. అది మానేజర్ మొహమ్మీద పడింది. కుత కుతలాడ్తూ షర్టుతో తుడుచుకోక తప్పలేదతనికి.

కుర్చీనీ అలవోకగా వెనక్కు జరిపి నేలమీద కూచుందా ఆకారం. నిరంజన్‌రావుకు నత్తగుల్లలా ముడుచుకోవాలన్పించింది. కాని ఆ ప్రయత్నం విఫలమైంది. ఆవులిస్తూ ఆకారంపైపే చూస్తున్నాడు.

"ఇలారా!" అన్నట్టుగా కుడిచేతి చూపుడువేలుతో సైగ చేసింది ఆకారం.

మానేజర్ నిరంజన్‌రావులో మళ్ళీ వణుకు ప్రారంభమైంది.

"రాను. నన్నొదిలెయ్. కావాలంటే మా ఆఫీసు ఉద్యోగులందర్నీ తినేసెయ్యండి." ఏడుపొస్తుంది. భార్యా పిల్లలు బుర్రలో గిర్రుమంటున్నారు.

"హారీ పీనుగా! నీ ఒక్కని ప్రాణ రక్షణకు మేమంతా ఫలహారమై పోవాలా!" గొణుక్కున్నాడు మాణిక్యరావు. ఆ గొణుగుడు అందరికీ విన్పించి మొహాలు చూచుకున్నారు.

"ఈ పొట్టి అనాకారి వెధవ మన కొంపముంచేట్టున్నాడండీ!" సుధాకర్ చెవి కొరికింది సుమంగళి.

"మీరుండండీ! ఆ భూత వైద్యుడు రానీ... ముందా దయ్యం సంగతీ. ఆ తర్వాత మన మానేజర్ దయ్యం సంగతీ... అన్నీ చూద్దాం!" సుమంగళి చెయ్యి పట్టుకుని చెవిలో చెప్పేశాడు సుధాకర్.

ఆహా! ఈ గండం గడిచి గట్టెక్కితే సుధాకర్‌ను నాలైన్లోకి తెచ్చుకోవాలి.... మురిసిపోయిందో క్షణం.

"తమర్ని వదిలేస్తే నా పని సున్నా!" ఆకారం గొంతు కీచుమంటూ పెగలింది.

ఓహో! దయ్యాలది కీచు గొంతన్నమాట! - అనుకున్నారంతా.

"ఐతే .... నన్ను నమిలి మింగితీరుతావన్నమాట! ఈ పూటకు ఆ ఇందిరను తినేస్తే సరిపోద్ది గదా!" నిరంజన్‌రావు లేవబోయాడు. తల టేబుల్ అడుక్కు గుద్దుకుంది. దభీన పడిపోయాడు బోర్లా.

"అయ్యయ్యో! నా పేరు చెబుతాడేంటీ! ఎంత మానేజరైతే మాత్రం..." ఝూడింపు కొనసాగించాలనుకుంది ఇందిర. మాణిక్యరావు సైగతో ఆగిపోయింది.

"టైమైంది. నేనే అటురానా?" అడిగింది ఆకారం. నిరంజన్‌రావు నీరుగారిపోయాడు.

"ఎందుకూ... నన్ను ఫలహారం చేసేందుకా? నన్నొదిలెయ్. నా భార్యకు నేనొక్క..." నాలిక్కరుచుకుని "నీకు పుణ్యముంటుంది. చచ్చి నీ కడుపున పుడతా!" దండం బెట్టాడు.

"ఐనా ఫరవాలేదు. నా పని నాది"

"ఐతే... దయ్యాలకు, దయా, జాలి ఉండవా?" ఏడుపులో రోషం కరిగిపోయింది.

గంభీరంగా నవ్విందా ఆకారం.

"నేను దయ్యాన్ని కాదు. ముందా బీరువా తాళాలిటు పడేస్తే నా పని నే జూస్కుంటా" అంటూ పాదాలు చూపించింది.

పాదాలు ముందుకు ఉన్నై. మనిషే

"అయితే తమరు గగ... గ్గజదొంగన్నమాట" నలభై దొంగల ఆలీబాబా గుహలా తెరుచుకుంది నోరు. వెన్నుపూస దాటిన వణుకు ఒళ్ళంతా పాకుతూంది.

"ముందు తాళాలిటు రావాలన్నానా!"

అది బెదిరింపో! బుజ్జగింపో!!

ఉద్యోగుల మొహాలు పంచరంగుల చిత్రాలైపోయినై.

"ఓహో! ఈరోజు జీతాలకని నిన్ననే క్యాషు డ్రా చేసుంచిన సంగతి తెలిసే వచ్చాడన్నమాట! మాణిక్యరావు కనుబొమ్మలెగిరి పడినై.

"మానేజర్‌గారూ! దొంగగారి బొడ్లో రివాల్వరుంటుంది సార్!" డిటెక్టివ్ నవల లెక్కువగా చదివే కమలాకర్ గుర్తు చేశాడు.

"ప్రాణాలు దక్కితే పటాంచెఱువు బస్టాండ్లో పల్లీలమ్ముకు బతకొచ్చు. తాళాలివ్వండి సార్!" మంగళకరమైన సలహా ఇచ్చింది సుమంగళి.

"ఐతే సరే!" కుర్చీ కాలు సాయంతో బయటికొచ్చి లేచి నుంచున్నాడు నిరంజన్‌రావు. తాళాలు అందిస్తూ,

"బీరువాకు డబుల్‌లాక్. మా క్యాషియర్ కామేశం తాళాల్తో ముందు తీసి ఆ తర్వాత వీటితో తీస్తేనే వస్తుంది. కామేశమింకా ఆఫీసుకు రాలేదుగా!" గొప్ప మిస్టరీ ఛేదించినట్టు నవ్వబోయి మానుకున్నాడు.

"దొంగగారి తిక్క తక్కున కుదిరింది." ఆదినారాయణ భుజమ్మీద చరిచాడు కమలాకర్.

"అబ్బా ! గట్టిగా అనకండీ! దొంగగారి రివాల్వర్ మన వైపు తిరగొచ్చు" మోచేత్తో కమలాకర్ డొక్కలో పొడిచాడు ఆదినారాయణ.

చరుపూ, పొడుపూ మోతాదు మించాయేమో ఒకర్నొకరు నమిలి మింగేస్తానన్నట్లు చూచుకున్నారు.

"అబద్ధం... మీ క్యాషియర్ కామేశం వచ్చేశాడు" నవ్వింది ఆకారం. అందరికీ భయమేసింది.

"ఈ నవ్వు ఎక్కడో విన్నట్టుందండీ!..." అనబోయి అరచేత్తో నోర్మూసుకుంది ఇందిర.

"అమ్మ తోడు... నా పెళ్ళామ్మీద ఒట్టు. మా ఉద్యోగులందరి మీదా ఒట్టు. కామేశమింకా రాలేదండీ!" ప్రమాణ పూర్వకంగా ఫైలు నెత్తి మీదుంచుకున్నాడు నిరంజన్‌రావు.

ఆకారం కుడి చెయ్యి నడుమ్మీది కెల్తోంది. అందరి గుండెల్లో రివాల్వర్ మోతలు.

"కామేశం రాగానే తాళాలిప్పిస్తా. ప్లీజ్ రివాల్వర్ తియ్యొద్దు" చేతులు మొహానికడ్డంగా పెట్టుకున్నాడు నిరంజన్‌రావు.

"మరి... నేనెవర్నటా?" టేబుల్ గుడ్డతో మొహం తుడుచుకుందా ఆకారం.

"నువ్వా!" నిరంజన్‌రావు నోరు ఆఫీసు మెయిన్ గేటులా తెరుచుకుంది.

"మరి ఈ అవతారమేమిటయ్యా మొగుడా!" దమ్మదీస్తూ కుర్చీలో కూలబడ్డాడు.

"నేను అక్షరాలా మీ కామేశాన్నే సార్. ఈ రోజు శనివారం గదా! శనేశ్వరస్వామి దీక్ష స్వీకరించి నల్లని డ్రెస్సు వేసుకున్నాను. ఈ శుభ సందర్భంగా ఓ మంచి గుణాన్నలవర్చుకోవాలన్నారు గురువుగారు. నేనేమో పొదుపును ఎన్నుకున్నాను. మొట్టమొదటి పొదుపు చర్యగా సిటీబస్ చార్జీలు సేవ్ చెయ్యాలని బస్ వెంట పరుగెత్తుకొచ్చాను. వర్షాకాలం గదా! రోడ్డుమీద గుంతలు. బురదంతా నా మీదే పడింది. వెంటనే జలుబు గూడా అందుకుంది సార్!" అంటూ విండో కర్టెన్‌తో చేతులు తుడుచుకున్నాడు.

"ఓర్నీ! ఆటో వెంట పరుగెత్తుకొస్తే ఇంకా ఎక్కువ పొదుపయ్యేది గదా!" గుండెల నిండా నవ్వేశాడు నిరంజన్‌రావు. ఆ నవ్వు పిడుగుపడే ముందు ఉరుములాగుంది.

జడుసుకుని చాంబర్ ముందున్న వాళ్ళంతా సీట్లవైపు పారిపోయారు.

ఐదు నిమిషాలు ఛాంబర్లో నిశ్శబ్దం రాజ్యమేలింది.

"భూతవైద్యుడొచ్చాడు సార్!" ఏ.పి. ఎక్స్‌ప్రెస్‌లా పరుగెత్తుకొచ్చాడు సీనయ్య.

అప్పటికే నిరంజన్‌రావు నిద్రలోకి జారుకున్నాడు. సూకరం అరుపులా పల్లవి అందుకున్న గురక చరణం వద్ద గర్జన స్థాయికి చేరుకుంది. ఉరుముల్ని, మెరుపుల్ని మించిపోయింది.

మీసాలు మెలేస్తూ వచ్చిన భూతవైద్యుడి మెదడు నరాల్లో గూడ్సు రైళ్ళు పరుగెత్తినై అరనిమిషంలో అయోమయంలో పడిపోయాడు.

నిరంజన్‌రావు గురక మరో చరణమందుకుంది. భూతవైద్యుడు ఏదేదో అరుస్తూ తన వేప కొమ్మల్తో తన వీపు మీద తానే కొట్టుకుంటున్నాడు. అటూ ఇటూ అంగలేస్తున్నాడు. దయ్యమై పోతున్నట్లు భయమేసిందేమో రాజధాని ఎక్స్‌ప్రెస్‌లా బయటికి పరుగెత్తాడు.

**"అభినందన" నుండి.**